# బుందేల్‌ఖండ్ ఎటు?

- ప్యాకేజీ ప్రభావంపై రాహుల్ ఆశలు
- ఓటుబ్యాంకుపై మాయా ధీమా
- ఓబీసీలపై భాజపా ఉమ అస్త్రం

హమీర్‌పూర్ నుంచి
న్యూస్‌టుడే ప్రత్యేక ప్రతినిధి




ఉత్తరప్రదేశ్‌లో అత్యంత వెనుకబడిన ప్రాంతం బుందేల్ ఖండ్. ఎన్నడూలేని విధంగా రాజకీయ నాయకుల హెలికాప్టర్లు ప్రస్తుతం ఇక్కడ చక్కర్లు కొడుతున్నాయి. ఈ ప్రాంతంలోని కీలక జిల్లాల్లో ఐదోదశలో భాగంగా ఈనెల 23న ఎన్నికలు జరగనుండటమే దీనికి కారణం. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకు భిన్నంగా, అభివృద్ధి ప్రధాన అంశంగా ఇక్కడ ఎన్నికల ప్రచారం కొనసాగుతుంది. ఈ ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు 70 శాతం వరకు ఉంటారు. వీరి వెనుకబాటుకు కారణం మీరంటే మీరేనంటూ ప్రధాన పార్టీలన్నీ దుమ్మెత్తి పోసుకుంటున్నాయి. బుందేల్‌ఖండ్ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకే[illegible]కొచ్చిన రాహుల్‌గాంధీ, ఈ ప్రాంతంలో ఎలాగైనా పాగావేయాలని చూస్తున్నారు. ఉమాభారతి తన కులస్థులందరినీ ఒకతాటిపైకి తీసుకొచ్చి భాజపాను గెలిపించాలని ఉవ్విళ్లూరుతున్నారు. విదేశాల మాదిరిగా మీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానంటూ ములాయం పేదల ఓట్లు అడుగుతున్నారు. కాన్షీరాం కాలం నుంచి తనకున్న దళిత ఓటు బ్యాంకును చూసుకొని మాయా గెలుపుపై ధీమాతో ఉన్నారు.

నిత్యం కరవు, రైతుల ఆత్మహత్యలు, అరకొర సాగునీరు, మితిమీరిన రుణభారం, కరెంటు కోతలు, వలసలకు మారుపేరు బుందేల్‌ఖండ్. ముఖ్యంగా గడచిన రెండేళ్లలో ఈ ప్రాంతంలో రైతుల ఆత్మహత్యలు జాతీయస్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ జరుగుతున్న ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. బాందా, చిత్రకూట్ జిల్లాల్లో ఆదివారం పోలింగ్ ముగిసింది. లలిత్‌పూర్, ఝాన్సీ, హమీర్‌పూర్, ఉరాయ్, మహోబా జిల్లాల్లో గురువారం ఎన్నికలు జరగనున్నాయి. కొంతకాలంగా బుందేల్‌ఖండ్‌లో ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ వినిపిస్తోంది. దీనికంటే సరైన పాలన, కనీస సౌకర్యాలు లేకపోవడమే అసలు సమస్య అని వాదించేవారూ ఉన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఏడాది నుంచి ఈ ప్రాంతంలో కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ప్రణాళికా సంఘం, కేంద్ర ప్రభుత్వాలను ఒప్పించి బుందేల్‌ఖండ్ అభివృద్ధికి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని సాధించారు. ఝాన్సీ ఎంపీ ప్రవీణ్‌జైన్‌కు కేంద్రంలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ లభించేలా చూశారు. ఇది గమనించి మాయావతి కూడా తరచుగా ఈ ప్రాంతం రావడం మొదలుపెట్టారు.

## బీఎస్పీకి పట్టున్న ప్రాంతం

చంబల్ లోయలకు ఆనుకొని ఉండటం వల్ల మొదట్లో ఈ ప్రాంతం గజదొంగలకు పేరుమోసింది. ఎవరూ తిరగడానికే సాహసించని రోజుల్లో బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం సైకిలు మీద విస్తృతంగా ఇక్కడ పర్యటించారు. బీఎస్పీకి ప్రధాన ఓటు బ్యాంకు అయిన దళితులు ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నారు. దీంతో ఆపార్టీకి మంచి పట్టు ఏర్పడింది. గత ఎన్నికల్లో మొత్తం 21 స్థానాలకుగాను 16 నియోజకవర్గాలను బీఎస్పీ కైవసం చేసుకుంది. ఎన్నికల పుణ్యమా అని మళ్లీ ఈ ప్రాంతం వార్తల్లోకి వచ్చింది. భాజపా నేత ఉమాభారతి చార్ఖరి సీటు నుంచి పోటీకి దిగడంతో మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఉమకు చెందిన లోధా కులస్థులు కూడా ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నారు. ఉమ రంగంలోకి దిగేంతవరకు భాజపా ప్రచారం నత్తనకడన సాగింది. ఎస్పీ కూడా క్రమేణా ఈ ప్రాంతంలోకి చొచ్చుకొని పోతుంది. ఆ పార్టీ అధినేత ములాయంసింగ్ బుందేల్‌ఖండ్‌ను ఇజ్రాయెల్ మాదిరిగా అభివృద్ధి చేస్తామంటున్నారు.




## ఓబీసీ ఓట్లపై కన్నేసిన భాజపా

మాయావతి కూడా రాహుల్‌పై అదే స్థాయిలో విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతున్నారు. 2007లో అధికారంలోకి రాగానే బుందేల్‌ఖండ్ అభివృద్ధికి కేంద్రాన్ని రూ.11వేల కోట్ల ప్యాకేజీ కావాలని అడిగినట్లు ఓటర్లకు చెబుతున్నారు. దీనిపై కేంద్రం ఏమీ తేల్చకపోగా, రాహుల్‌గాంధీ ఇక్కడికి వచ్చి బీఎస్పీకి వ్యతిరేకంగా ధర్నాలు చేస్తూ రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తుతున్నారు. మరోవైపు భాజపా ఓబీసీ ఓట్లను చీల్చడానికి పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే ఉమను బరిలోకి దించింది. బీఎస్పీ నుంచి బహిష్కరణకు గురైన బాబూసింగ్ కుష్వాహాను ప్రచారానికి పంపింది. బుందేల్‌ఖండ్ ప్రాంతానికి చెందిన కుష్వాహాకు ఆయన వర్గంలోని వెనుకబడిన కులస్థుల మద్దతు ఉంది. ఓబీసీ కోటాను చీల్చి మైనారిటీ రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ ప్రచారం చేయడం కూడా భాజపాకు కలిసొచ్చింది. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓబీసీలను కూడగట్టడానికి భాజపా ఈ అంశాన్ని వాడుకుంటుంది. ఉమాభారతికి బుందేల్‌ఖండ్ ప్రాంతం పరీక్షగా మారింది. బబినా, గరోత్, మహ్రౌనీ, లలిత్‌పూర్, రాత్, మహోబా, హమీర్‌పూర్ నియోజకవర్గాల్లో ఉమ కులస్థులు ఎక్కువగా ఉన్నారు. ఇక్కడ గెలుపు కోసం ఉమపైనే భాజపా ఆశలు పెట్టుకుంది.

కాంగ్రెస్, ఎస్పీలు మాయావతి ప్రభుత్వ అవినీతిని మరో ప్రధాన అస్త్రంగా ఎన్నికల్లో ప్రయోగిస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకతను సొమ్ము చేసుకోవడానికి వ్యూహం పన్నుతున్నాయి. కుష్వాహాతోపాటు అవినీతి ముద్రపడిన మరో మంత్రి సిద్దిఖీ లక్ష్యంగా విమర్శలు గుప్పిస్తున్నాయి. బీఎస్పీ ప్రభుత్వంలో మంత్రులుగా ఉంటూ వీరిద్దరూ బుందేల్‌ఖండ్ ప్రాంతంలో కొన్నాళ్లు రాజ్యమేలారు. కుష్వాహాపై సీబీఐ, సిద్దిఖీపై లోకాయుక్త విచారణ జరుపుతున్న అంశాన్ని కాంగ్రెస్, ఎస్పీలు సభల్లో లేవనెత్తుతున్నాయి. యూపీలో మైనింగ్ మాఫియాతో వీరికున్న సంబంధాలను ప్రస్తావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వెనుబడిన బుందేల్‌ఖండ్ ప్రాంతం ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది.

## పార్టీ నేతగా మాట్లాడా: మంత్రి బేణీ

